# వాణీ - ఎ - స్టడీ

అన్న లాక్కొచ్చి యింటో పారేసిం తరవాత వాణి గతి చాలా హీనమైపోయింది. కాళ్ళూ చేతులూ విరక్కొట్టి కట్టేసి ఆమె నిస్సహాయస్థితిని చూసి, బాగా, ఏడిపించి కసితీర్చు కుంటున్నారు, ఇంట్లోవాళ్ళూ, బైటవాళ్ళూకూడా. కాని వాణి స్పోర్టివ్. ఎంత విచారంలోనూ ఆమె హ్యూమర్ విడవదు.

"ఓరి మీ దుంపతెగా, బోనులో ఎలికను పొడిచినట్టు పొడుస్తున్నారేమ్రా నన్ను !" అని అరుస్తుంది.

"ఈ బోడి ముండలందరూ నన్ను చూసి అసూయ పడకపోతే జుట్లు పెంచుకుని తలో మొగాడివెంటా పడకూడదూ?" అంటుంది.

ఆమె నోటికి వెరచి యెదురుగుండా ఆమెనేమీ అనడానికి జంకుతారు. సిగ్గువున్నంత వరకేగాని తారాబాయివలె రోడ్లమీద మొగవాళ్ళ బట్టలు వూడతీసి వెంకటచలంమల్లే కథలు వ్రాసీ, గుట్లు బయట పడేస్తే ఎవరికైనా భయమేకద!

వాణిని రెండునెలల కిందటివరకు ముద్దుగా పెంచారు. పెనిమిటిపోయినాడనే సానుభూతివల్ల ఆమె కేమీ తిండిలోగానీ, శృంగారంలోగానీ లోపం లేకుండా, ఆమె తన స్థితిని మరవడానికి సహాయంచేశాడు, ఆమె అన్న నరసింహారావు. నవలలు, ఆడ స్నేహితులు, మీటింగులు, సినిమాలు వీటివరకు స్వేచ్ఛనిచ్చి శరీరస్థితిని మరచి పొమ్మన్నారు. కాని ప్రంబంధంకన్న విరహం మాన్పడానికి చంద్రుణ్ణీ, కోవెలనీ, మందమారుతాన్నీ పంపినట్టు ఫలించింది ఆ ప్రయత్నం. ఇంకోడి పెళ్ళానెత్తుకపోయి, సర్వమూ అర్పించిన పురాణమూ, అయిదుగురు మొగుళ్ళతో తృప్తిపడని వనిత పురాణమూ, పదహారూ వేల గోపికలకుగాను పదేళ్ళ వయసునించే కామ ప్రవీణుడైన పురాణమూ అప్యాయంగా చదివింది. 'ప్రణయకథలు వేసుకోము' అని ప్రమాణాలు చేసిన పత్రికల్నే తెప్పించారు. పురాణగాథలున్న సినీమాలే చూడనిచ్చారు. మొగాళ్ళురాని మీటింగులకే వెళ్ళనిచ్చారు. ఐనా ఎట్లాగో తెలీదు వాణి కొంప ముంచింది.

నీతి నవలల్లో, ఎవత్తా లేచిపోలేదన్న మాటేగాని, అసలు కథానాయకుడితోనే, లేచిపోయిన వాళ్ళకన్న యెక్కువ పనులు నాయిక చేస్తుంది. శ్రీకృష్ణుడి కోసం రుక్మిణి విరహమూ, అతను యెత్తుకుపోయిన విధమూ చదువుతోంటే, చివరికి పెళ్ళి అయిందా లేదా అనేది చాలా స్వల్పవిషయంగా తోస్తుంది.

ఈ పతివ్రతలు పడే విరహాలూ, లేకి కోర్కెలూ, మొగాడిమీది వాళ్ళ గుడ్డి కాపీనమూ, వినికిడి వల్లనే కలిగే తాపజ్వరాలూ, లేచిపోయే నీచపు వనితలకి వుండనే వుండవు. యథావిధిగా

వివాహమంత్రాలువుచ్చరించారా లేదా అని చూసుకుంటారు కాని యీ లోపల జరిగే కామజ్వర జనితదుర్వ్యసనాన్ని గమనించరు. పత్రికల్లో, కథల్లో, పురాణాల్లో యీ పెళ్ళిళ్ళసంగతి చదివి, చదివి, దంపతుల సరాగాలు, ధ్యానించి ధ్యానించి, పురుష వర్ణనలు మననం చేసి చేసి, ఆ కథలన్నీ ప్రేమయుత పవిత్ర వివాహమంగళవాద్యాలతో అంతం కావడంవల్లనూ, యేకథలోనూ పత్రికల్లోనూ, ఆ వివాహమైన తరువాత సంగతి- పోట్లాటలూ, పిల్లలూ,తిట్లూ, ద్వేషాలు, జెలసీలూ, చిత్రించకపోవడవం వల్లనూ పెళ్ళికావడము అంటే గొప్ప భ్రమయేర్పడ్డది ఆమెమనసులో, వాస్తవ ప్రపంచంకన్న వూహా ప్రపంచమే సామీప్యమయింది. విమలను గుర్రంమీద తీసుకుపోయిన వుదయాదిత్యుడూ, పద్మనుభుజంమీద మోసుకుపోయిన విక్రమసింహుడూ, హేమలతను బంధించిన వజీర్ ఖానూ, స్వర్ణలతను బలాత్కరించిన లాలాసింగూ, మొగవేషంలో యుద్ధంచేసిన ప్రేమలతను ఆలింగనం చేసుకున్న యుద్ధమల్లుడున్నూ వీరందరూ ఆమె కళ్ళయెదుట తిరుగుతున్నారు. భర్తలంటే యీ సామాన్య వెంకటేశ్వర్లూ, సీతారామయ్యలూ కాక, గుర్రాలమీదా, రథాలమీదా మెరిసిపోయే యోధాగ్రేసరులుగా తోచారు. ఎవడో తనని కిటికీలోంచి చూడడమూ, మోహించడమూ, కృష్ణుడివలె తనని తటాలున యెత్తుకుని పోవడమూ, ధ్యానించుకునేది. ఆమె అన్న నరసింహం, సినిమాలో నీతికోసం వెతికేవాడు. అతని చెల్లెలు రొమాన్సుకోసం వెతికేది. పతివ్రత సీత రాముణ్నిచూసి రొమ్ము విరవడమూ, ఆహ్వానిస్తున్నట్టు అడియన్సువంక చూడడమూ, ఏడ్చేప్పుడు కూడా కులకడమూ, 'రాముడు నన్ను వదిలేశాడు, పోనీ మీరెవరూ అంత మాత్రం వారు లేరా?' అన్నట్టు 'వలపుట్యుయస్'గా చేతులు జాచడమూ అతనికి వికృతంగా కనపళ్ళేదు. ప్రపంచంలోని పతివ్రతలందరూ అంతే గనక. ఏ నాటకంలోనో యముడు సావిత్రిని వరించాడని అర్థం చేసుకోకుతండా ఏడుపేగాని ఫిల్ములో సావిత్రి యముణ్నేకాదు, ప్రతీవాణ్నీ వరించమని అడుగుతున్నట్టు నటిస్తే యెవరికీ వెగటుగా తోచదు. ఎందుకు? ఈ నీతి ప్రభువులకి మాటలు ప్రధానంగాని, ప్రవర్తనకాదు గనక! కాని యిదంతా వాణిని అన్‌కాన్‌షస్‌గా ఇన్‌ఫ్లూయన్సు చేశాయి. ఎక్కడన్నా ఆలింగనం దొరికితేచాలు, శరీరంతోసహాయెగిరిపోవాలని కాచుకుని వుంది, వాణి హృదయం. ఈ లోపున నరసింహా రావు అందరితోనూ, తను తన చెల్లెలికి యిచ్చేశిక్షణా, స్వేచ్ఛా, ఆమెశీలమూ, తన ఔదార్యమూ, ప్రకటించుకున్నాడు.

"చూశారా? ఈ కాలంలో స్వేచ్ఛనియ్యకపోయినా తంటాయే ఇచ్చినా తంటాయే. నావంటి తెలివిగలవాడేం చేస్తాడంటే, యిచ్చినట్టుగానే యిస్తాడు. మళ్ళీ నిజంగా యియ్యనూ యియ్యడు. గవర్నమెంటు మోస్తరనుకోండి. అంతేగా స్వేచ్ఛకూడనివాళ్ళు స్వేచ్ఛ కావాలని మారాంపడితే యేం చేస్తారు మరి! తెల్లవాళ్ళ దగ్గర్నించి నేర్చుకోవలసింది అది ఇప్పుడు మా వాణికి ఏం తక్కువ? మళ్ళీ ఏ పొరబాటన్నా జరగడానికి వీలువుందా?" అంటూ స్త్రీలకు స్వేచ్ఛ కూడదనేవాళ్ళనూ, కావాలనే వాళ్ళనూ అందర్నీ హేళన చేస్తున్నాడు.

"ఒకటేనండీ పాయింటు స్వేచ్ఛ అంటే లైసెన్సు కాదండి. మంచికేగాని చెడ్డకిలేదు. అది తెలుసుకోవాలి. ఆడదానియిష్టం. ఎక్కడికంటే అక్కడికి దాన్ని పోనీండి కాని ఒంటరిగా యింకోడితో వెళ్ళనీకూడదు. అదీ కిటుకు."

అని స్వతంత్రాన్ని తన జేబులోదాచి, క్రమంగా కొంచెంకొంచెం తీసి తెలివిగా యిస్తున్నట్టు మాట్లాడుతున్నాడు.

మూడు నెలల కిందట ఒక నాటకం కంపెనీ ఆమె హృదయశాంతికేమోనన్నట్టు ఆ వూరు వచ్చింది. వాళ్ళ ముఖ్యనాటకం 'రోషనార' ఆ నాటకంలో శివాజీ ఏకపత్నీవ్రతం చాలా నీతిబోధకమని నరసింహారావు భార్యనీ, చెల్లెల్నీ నాటకానికి తీసికెళ్ళాడు. కాని వాళ్ళిద్దరి కళ్ళూ శివాజీ ఠీవిమీదనే వున్నాయి. ఆ ఆడవేషం వేసుకుని అప్పనాచార్యులు, శివాజీ మనసుని మార్చలేక పోయినాడు. తనే అయితే అంత యోచనా! అనుకున్నది, వాణి. అంత నిగ్రహంవున్న యోధుడి మనసునే చలింపచెయ్యాలి. తన హృదయంలోని ఆదర్శరూపాన్ని శివాజీతో సంక్రమింప చేసింది. నాటక రంగంమీద రోషనార, శివాజీకోసం చేసే ప్రయత్నాలు చూస్తే, చక్రవర్తి ఔరంగజేబు చెల్లెలు కాదుకదా, బండిమనిషి మీరాగాడి చెల్లెలుకూడా అట్లా ప్రాధేయపడదు. అలా ప్రాధేయపడే ఆడదాన్ని శివాజీ కాదుకదా, లేకి కోనయ్య కూడా తాకడు. కాని యీ ఆధ్యాత్మిక దేశంలో యీ నాటికి కూడా ప్రతీయింటా ప్రతివ్రతా శిరోమణులు వెలిసివున్నారు గనుక, ఆ మదపిచ్చి యెవరికీ వెగటుగా తోచలేదు. ఆ రోషనారే గనక ఆ రొమ్ము బాదుకోటాలు మాని,

"నీకు యీ భారతదేశ సామ్రాజ్యానిస్తాను. నన్ను రాణిని చేసుకుంటావా?" అని శివాజీకి బెజినెస్ ప్రాపొజీషన్ పెడితే!

శివాజీ?

"అవును నా హిందూదేశం కోసం ప్రాణాన్నే యిస్తానే! ఈ ఏకపత్నీత్వాన్ని వదులు కుంటేనేమి?" అని, ఒప్పుకుంటాడనుకోండి.

ఇంకేముంది? ఆ కథ వ్రాసినవాడిని, తిట్లతో ఆశీర్విదిస్తారు.

ఆ శివాజీ శీలభావ ప్రదర్శనానికి ముచ్చటపడి, అతను తనవలెనే వ్యాపారి బ్రాహ్మడని తెలుసుకుని, నరసింహారావు శివాజీని భోజనానికి పిలిచాడు. తాంబూలం వేసుకుంటూ; నరిసింహారావు-

"మగవారి శీలమంటే ఆ విధంగా వుండాలండి, ఆడదిమీదపడ్డా; చలించని స్థయిర్యం కావాలి."

అంటో వుండగానే, అన్న వెనకనించి తలుపు సందులోనించి చూసే వాణివంక చూస్తున్నాడు అభినవ శివాజీ.

ఆ మర్నాడు నాటకం పాకంతా కిక్కిరిసి నిండింది. శివాజీ నాట్యకౌశలం అందరూ అద్భుతంగా పొగుడుకుంటున్నారు. కాని పదకొండయింది. తెరయెత్తలేదు కనుక్కుంటే శివాజీ కనపళ్ళేదన్నారు. నరసింహారావుగారి చెల్లెలూ మర్నాటినుంచి కనిపించలేదు అతాత్తుగా చదువుకోడానికి రాత్రి లక్నో పోయిందన్నారు. నరసింహారవు యింటి ఆడ వాళ్ళు.

ఆ మధ్యాన్నమే ఆ ఒక్క చూపుతోటే అర్థమయింది వాణికి శివాజీ హృదయం నవనీత మృదులమని. తనని చూసి నవనీత మృదులమయిందని భ్రమపడ్డది. కాని ఏ నిమిషానైనా పాపం మా హృదయం నవనీత మృదులంగానే వుంటుందని తెలీదు. నాటకానికి వెళ్ళే గుంపుతో కలిసి స్టేజీ వెనకాలకి చేరుకుంది. చీకట్లో పక్క కర్టనులో నుంచుని చూస్తోంది సమయం కోసం. ఎవరో వొచ్చి, యెగాదిగా చూసి, యెవరని అడిగాడు. చేతిలో రూపాయి పెట్టి, మీసం తగిలించుకుంటున్న శివాజీవేపు చూసి, ఆయన్ని పిలవమంది. రూపాయి కబురందించింది చాలా జాగ్రత్తగా. వచ్చాడు, గుర్తించాడు శివాజీ.

"ఏమిటిట్లా వచ్చావు?"

"వొచ్చేశాను."

"ఎందుకు?"

తలవొంచుకుంది. ఎందుకు వొచ్చేసిందో ఆమెకే తెలీదు; ఈపారిపొయ్యే స్త్రీలకు చాలామందికి తెలీదు. లోకమంటే యేమిటో తెలీని పంజరాల్లో పెరగడంవల్ల, లోకం ఆకర్షణీయమైన అనేక వింత రంగులతో కనబడుతుంది. కటకటాల మధ్యనుంచి. సామాన్య పదార్థంకూడా అసాధారణ లావణ్యాన్ని ప్రదర్శిస్తుంది, పాపం, ఆశతో నిండిన వాళ్ళ పిచ్చినేత్రాలకి హృదయంలో తన ప్రపంచం-పుస్తకాలూ, వార్తలూ, సినిమాలూ.....ప్రేరేపించే ఉద్రేకాలకూ, వాంఛలకూ, తట్టుకోలేక, సామాన్యదినచర్య జీవరహితంగా తోచి, స్వేచ్ఛకోసం పెనగులాడి, తపనపడి, అమాంతం దూకుతారు, పంజరంలోంచి నిప్పుగుండంలోకి.

మానవ హృదయం కావడంచాత, తమకు జీవితం ప్రసాదించని అద్రుష్టాలకోసం, కలలుకని, ఆశలుపడి, ఈ కుటుంబ ఆటంకాలూ, ఈ సంఘ నిబంధనలూ, ప్రేమించేవారి ఆభ్యంతరాలూ తమను బంధిస్తున్నాయని భావించి, స్వర్గమూ, సౌందర్యమూ, ఆ యింటి అవతల పక్కన, ఆ రోడ్డు దాటితేచాలు, సమస్త అనుభవాలూ తమకోసం కాచుకుని వున్నాయని ధ్యానించుకుంటారు, పాపం! దీనికంతా ఈ వాస్తవ ప్రపంచాన్ని చిత్రించని కథలూ, పురాణాలూ, నాటకాలూ కారణం.

"ఎందుకు వచ్చావు? వాణి!"

"మీకోసం" అంది.

అది నిజంకాదని ఆమెకేతెలీదు. పారిపోయిన ఆమె ఆత్మని వెతుక్కుంటూ వొచ్చింది ఆమె. అంతే.

"ఏమంటావు!"

ఆలోచిస్తోంది. అతనే అంతా తనకి సులభం చేస్తాడనీ, కర్తవ్యం చూపుతాడనీ అనుకుంది. కాని అతను తొందరపడుతున్నాడు.

"నేను వెళ్ళాలి తరవాత మాట్లాడదాము." ఎంత సులభంగా అన్నాడు ఆ మాటా అతనికేం! "తరవాత" అంటాడు. తాను ఈ లోపలయేమైపోతుంది?

"కాదు యిప్పుడే రండి వెళ్ళిపోదాము."

జీవితానికంతా ఇదే, ఒక్కటే ఛాన్సు తనకి. అతనికి నిర్లక్ష్యమైన సంగతి ఆమె చూడటంలేదు. ఎంతసేపటికీ "తనవాంఛ, తప్పించుకోవాలనే తనకోర్కె, తన రొమాన్సు" ఇదే యోచన. అతను ఒక సాధనం, నిమిత్తమాత్రం. ఆ హృదయంలోని యెండుగడ్డికి నిప్పంటించినసూత్రం అతను,

కాని ఆమె అందం, ఆమె తొందరా చూస్తున్నాడు అతను.

ఎక్కడో పూర్తిగా అతనికన్నకూడా పురుషుల్ని అదే పనిగా, వృత్త అలవాటు ఎక్సైట్మెంటు కోసం రుచిచూసిన మామూలు స్త్రీలని తప్ప, యీవిధంగా తననే కోరి అనాఘ్రాతంగా తనదగ్గిరకు అడిగి వొచ్చేవాళ్ళు ఎవరున్నారు? అందులో అంత ఆత్రుత పడుతోంది. బాగా మొహం మొత్తిన అతని రసికానుభవానికి యీ కొత్తపిల్ల కొత్తరుచి కలిగించింది.

"డబ్బు యింకా వీళ్ళివ్వలేదే?"

మాటాడకండా పర్సులో నోట్లు చూపింది.

"జంకకండీ. ఇది నా స్వంతం."

"సరేలే, తరవాత?"

"అబ్బా! ఎంత జాగ్రత్త యీ మొగాళ్ళకి. అతనే 'తరవాత' అని ప్రశ్నిస్తే, తను ఎంత ప్రశ్నించాలి?

తన కలల ప్రకారం జరగటంలేదు చరిత్ర. సుందరమైన స్త్రీ వచ్చి తనంతట తాను పురుషుణ్ణి వేడుకోవడంవుంది. రోషనారా నాటకంలోనే వుంది. కాని పురుషుడు నీతి నియమాల వొంకన నిరాకరించడం మామూలుగానీ, ఆర్థిక పద్ధతులమీద జంకలేదు! ఇదేమిటి యీ అభినవశివాజీ ఇట్లా భయపడతాడు? ఇన్ని గారంటీలివ్వడం చాలా సిగ్గుగావుంది. కొంచెం ధైర్యం తక్కువపిల్ల, కొంచెం మొండితనం ఎక్కువగా లేని పిల్ల, వెనక్కి వెళ్ళి వుండును. కాని చిన్నప్పణ్ణించి సాహసవంతులైన ఝాన్సీరాణి, మీరా, అహల్యాబాయి మొదలైన వీరవనితల చరిత్రల్ని మననం చేసుకున్న వాణిది, పట్టిన పట్టు వదలకూడదని అన్న ఎవరికి బోధించాడో ఆ చెల్లెలు, వెనక్కి తగ్గలేదు. కొంచెం పమిట

తొలగించి కాసులదండా, పలకసర్లూ చూపింది. అతను వాటి వెనుకకూడా చూడాలని ప్రయత్నించాడు. దాంతో మన వరుడికి ఆమెమీద అద్భుతమైన మోహం కలిగింది. "పద" అన్నాడు.

అందువల్లనే ఆ రాత్రి రోషనారా చూసేభాగ్యం నాటకాలు అవినీతికి పుట్టిళ్ళని లెక్చరిచ్చిన రామసోమయాజిగారికీ, నాటకాలకి వెళ్ళిన స్త్రీలని వేశ్యలవలె చూసే రాజమ్మగారికీ రోషనారా చూసి, ఉబలాటబడే భాగ్యం లేకపోయింది. టిక్కట్లడబ్బు వాపసు చెయ్యామని గోలచేసే గుంపు కాళ్ళు నలగతొక్కారు. డొక్కల్లోకుమ్మారు. రాజమ్మగారు ఎండిన వొరుగు. కాని, లేకపోతే పాపం నాటకం చూసేసరదా కొంతతీరేది.

విశాఖపట్నం సత్రంలో దిగారు. మూడురోజులు ఆమెతోనే గదిలో గడిపాడు అభినవ శివాజీ. ఆమెకి కొంచెం వూపిరాడా లనిపించింది. అతనికే బైట పడాలనిపించింది. ఒకరితో ఒకరు ఆమాట అనడానికి భయం....ఎక్కడ ప్రేమ పోయిందని రెండోవారు అంటారో అని! పలకసర్లు అమ్మితెస్తానని అతను వెళ్ళి సాయంత్రందాకా రాలేదు. ఆమె కాచుకుని కూచుంది వొంటరిగా. ఇట్లా ఇతనితో జీవితమంతా గడపవలసిందేనా? ప్రేమా, స్వేచ్ఛా అంటే యిదా అర్థం? ఇంతలో చీకిపోవడమా? ఏదో ఒక రాత్రికే, ఒక మధ్యాహ్నానికే అయితే హాయిగా వుంటుంది. జీవితమంతా అదే ఐతే? అదికాక వేరే అనందం కనపడదు. బతికినన్నాళ్ళూ యిట్లా గడపవలసిందేనా? ఇంటి దగ్గిర అమ్మ తిట్లూ, అన్నయ్యాడాబులూ, పిచికల అరుపులూ, దాసిదాని తగాదాలూ చాలా ఆకర్షకంగా కనబడ్డాయి. తనుబడ్డ కామ బాధా, ఎప్పుడు పారిపోదామా అనే తహతహ అన్నీ మరిచిపోయింది సాయంత్రానికి అతను వొచ్చి డబ్బిచ్చాడు. రాత్రి సంతోషంగా గడిపారు. కాని మర్నాడు పగలంతా మళ్ళా మాయమైనాడు.

ఈ లోపల ఆ సత్రంలోనే దిగిన వాళ్ళ దూర బంధువు సత్యనారాయణ వీళ్ళనిచూసి, చల్లగా యింటికి రాశాడు. రెండో రోజుకి నరసింహారావు వొచ్చాడు. అన్నను చూడగానే సంతోషంతో అతన్ని కావిలించుకుని ఏడ్చింది వాణి. మాటాడకుండా ఇంటికి తీసుకుపోయినాడు సాయంత్రం రైల్లో.

రైల్లో ఆలోచించుకుంది వాణి, ఇంటిదగ్గర తనను తన్నడమూ, మాడ్చడమూ, కాల్చడమూ, ఇవన్నీ చేస్తారుగావునని. వెళ్ళి వెళ్ళడంతో బోరుమనియేడ్చి తల్లి మెడమీద పడ్డది.

"ఎంతచేశాడే అమాయకురాల్ని చేసి?" అని యేడ్చింది తల్లి.

కాని మర్నాటినించి యింటోవారి చూపులూ; సినిమాలూ, పుస్తకాలూ, స్నేహితులూ, చివరికి వీధిలోకి తొంగిచూడడంకూడా కట్టుపడేప్పటికి, ఆమెకి, ఒక్కసారి తనని వాతలు పెడితేనే ఇంతకన్న నయమనిపించింది. "ఇదేంపుట్టిందర్రామీకూ! నన్ను పారీపోనీరు,

ఇంటోనూ వుండనీరు సరిగ్గా, ఎట్లా చావనర్రా! పోనీ గుండుచేయించడర్రా కాశీరామేశ్వరాలు తిరిగి వొస్తాను. నా కాసులపేరు అమ్ముకుని !" అంది. హ్యూమర్ మాత్రం విడవలేదు ఆ వాణిని. మళ్ళీ ఎప్పుడు పారిపోదామా, ఎవడన్నా దొడ్డిదోవన వొచ్చి తనని యెత్తుకొని పోకూడదా? అప్పుడు కనపడలేదుగాని, విశాఖపట్నం సత్రం, సముద్రం, కొండలు ఎంత అందంగా వున్నాయి. శివాజీ ఎంత రమ్యమైనవాడు, అతని కావిలింతలు-అవి ఇంకా ఎన్నెన్నో యోచించుకుంది-ఒక్క అనుభవమూ లేక కరువువాచి అన్నీ ఆ నాలుగు రాత్రులే కాకపోతే, కొన్ని యీ రాత్రులకు దాచుకోడానికి వీలుండకూడదూ? పక్కగదిలో వొదినా, అన్నయ్యా ఎంత సంతోషంగా గడుపుతున్నారు......ఒక్క పక్కమీదనే ?

కాని వాళ్ళిద్దరూ ఒకరికి రెండోవారు ఎప్పుడు వొదిలిపోతారా, అని ద్వేసించుకుంటున్న సంగతి ఆమెకు తెలుసు, పురుషుడికోసం అరిచే ఆమె నరాలకి!

అదీలోకం!

◆ ◆ ◆

*ప్రచురణ : (అనసూయ కథల సంపుటి) ప్రజాప్రచురణలు, 1959*